ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -54 పేజీలు - 8 వెల - 03/- శనివారం 13 జూన్ 2026





# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం

**రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు**

- స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం
- సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి
- ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం
- తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదు
- వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చిన కేంద్రం
- పోలవరం, అమరావతి,రైల్వేజోన్ తదితర ప్రాజెక్టులకు చేయూత
- జగన్ విధ్వంసంతో రాష్ట్రం అధోగతి పాలయ్యింది



**తిరుపతి జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. 2లో.

# ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



- ప్రజలు అధికారంతో పాటు ..
- అతి పెద్ద బాధ్యత అప్పగించారు
- గ్రామాల అభివృద్ధితోనే దేశం బలపడుతుంది
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- యువత ఆశయాలు, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి



# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

**విజేతల జాబితాలో ఖర్గే, తరుణ్ చుగ్**



**న్యూఢిల్లీ, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా**మిగతా 2లో...**

# శాంతి చర్చల డైలమా



- ఇంకా ఏదీ ఖరారు కాలేదు
- ట్రంప్ ఒప్పందం ప్రకటనను తోసిపుచ్చిన ఇరాన్
- ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి
- ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టీకరణ



**వాషింగ్టన్, టెహ్రాన్ : జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. ఇరాన్‌తో జరుగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే ఒప్పందం త్వరలోనే కుదిరే అవకాశముందని ప్రకటించినప్పటికీ ఆ విషయాన్ని ఇరాన్ తోసిపుచ్చింది. చర్చలు కొనసాగుతున్నాయనీ, అయితే ఇంకా ఎలాంటి తుది నిర్ణయమూ తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి స్పష్టం చేశారు. దీంతో మధ్యప్రాచ్యంలో ఇప్పటికీ అనిశ్చితి కొనసాగుతోంది.

ట్రంప్ ఏమన్నారు?
ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక దాడులు చేయాలని అమెరికా సిద్ధమైందని హెచ్చరించిన ట్రంప్.. అనంతరం చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలు తయారు చేయకూడదన్నదే మా ప్రధాన లక్ష్యం. ఆ దిశగా గొప్ప ఒప్పందం**మిగతా 2లో...**

# మనది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి

- రప్పా..రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు
- రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది
- రాయలసీమను రాయల్ సీమగా మార్చాం
- తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు



2లో.

# పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు

- పరిశ్రమలు బంకుల నుంచి కొనొద్దని ఆదేశాలు
- బల్క్ డిపోల నుంచే ఇంధనం కొనాలని సూచన
- రోజుకు 200 లీటర్ల డీజిల్‌కే అనుమతి
- ఆంక్షలు 90 రోజుల పాటు అమలు
- నిల్వలు, బ్లాక్‌మార్కెట్‌పై కఠిన చర్యలు



**న్యూఢిల్లీ, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, పెద్ద కంపెనీలు ఇకపై పెట్రోల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీ చేసింది.**2లో...**

# విద్యుత్ ఛార్జీలను పెంచబోం

**జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి**

**ట్రూడౌన్ విధానం ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించామని వెల్లడి**



2లో.

# తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కళ్యాణ్‌కు ఉంది

- ఇటీవల పవన్ సభకు అనుమతి నిరాకరించిన తెలంగాణ ప్రభుత్వం
- శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయమే అన్న రేవంత్
- ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎవరైనా రాజకీయాలు చేయడానికి స్వేచ్ఛ ఉందని,**మిగతా 2లో...**

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం.

పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, ఢిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు. వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందని అన్నారు. కేంద్ర పథకాలు, సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. 21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో



బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈసభలో పాల్గొన్నారు.

## ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ

ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

-----------

# మనది గూగుల్ అయితే.. వారిది గొడ్డలి

**తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు**

**తిరుపతి జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**

కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ప్రజలే వారి జెండాను పీకేశారు' అని అన్నారు. ప్రస్తుతం కొందరు 'రప్పారప్పా' అంటూ హెచ్చరికలు చేస్తున్నారని.. అయితే తాము చూస్తూ కూర్చోమన్నారు. రెడ్ బుక్ తన పని తాను చేసుకుంటూ పోతుందని హెచ్చరించారు.

అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి మధ్య తేడాను వివరిస్తూ నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ అంటే జెన్-జీ కాదు, జగన్ అంటే గొడ్డలి' అంటూ ఎద్దేవా చేశారు. జగన్‌కు క్రెడిట్ తీసుకునే అలవాటు ఉందని ఆరోపించిన లోకేష్.. 'రానున్న రోజుల్లో స్వాతంత్ర్యాన్ని కూడా మా తాత తెచ్చాడని జగన్ చెప్పినా ఆశ్చర్యపోనక్కర్లేదు' అని వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చే ప్రతి రూ.100 పెట్టుబడుల్లో రూ.25 ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగిందని లోకేష్ సంతోషం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో రాజకీయాలు చేసే స్వేచ్ఛ పవన్ కల్యాణ్‌కు ఉంది

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించాలనుకున్న బహిరంగ సభకు అనుమతి నిరాకరించిన అంశంపై స్పందించిన సీఎం... ఆ నిర్ణయం పూర్తిగా శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తీసుకున్నదేనని వివరించారు. ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి నాయకుడికి సమాన అవకాశాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంపై ఎలాంటి ఆంక్షలు లేవని, నిబంధనల ప్రకారం ఎవరైనా తమ రాజకీయ కార్యకలాపాలు కొనసాగించవచ్చని తెలిపారు.

ఇదే సమయంలో జాతీయ రాజకీయాలపై కూడా ఆయన స్పందించారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేని పరిస్థితిలో నామినేషన్ తిరస్కరించడం ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షాల అవకాశాలను పరిమితం చేసేలా వ్యవహరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా వ్యవస్థలు పనిచేయాలని రేవంత్ రెడ్డి సూచించారు.

# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

**మొదటిపేజీ తరువాయి**

వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

# పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డీజిల్‌కు అసాధారణంగా డిమాండ్ పెరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధర, సాధారణ పెట్రోల్ బంకుల్లోని ధర కంటే ఎక్కువగా ఉండటంతో అనేక సంస్థలు బంకుల నుంచే భారీగా కొనుగోళ్లు చేస్తున్నాయి. దీంతో సాధారణ వినియోగదారులకు సరఫరా సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం భావించింది.

ఢిల్లీలో ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర పెట్రోల్ బంకులో రూ.95.20గా ఉంది. అదే బల్క్ కొనుగోలుదారులకు ఈ ధర రూ.134.50గా ఉంది. ఈ తేడా కారణంగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు బల్క్ డిపోల బదులు బంకుల వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని గుర్తుచేసింది. షిప్పింగ్ వ్యవస్థ కూడా ప్రభావితమవడంతో దేశీయంగా ఇంధన లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తాజా ఆంక్షలు తీసుకొచ్చింది.మరోవైపు 'పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్' (పీఈఎస్ఓ) అనుమతి పొందిన కంటైనర్లకు మాత్రమే డీజిల్ విక్రయించాలి. ఒక వినియోగదారు లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని ఆదేశించారు. దీన్ని మళ్లీ విక్రయించడం పూర్తిగా నిషేధం. నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక కొనుగోళ్లు, ఇంధన మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఈ ఆంక్షలు మొదట 90 రోజుల పాటు అమల్లో ఉంటాయి. అవసరమైతే మరో ఉత్తర్వుతో గడువును పొడిగించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా సాధారణ వినియోగదారులకు ఇంధన కొరత తలెత్తకుండా చూడటమే ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

# శాంతి చర్చల డైలమా

**మొదటిపేజీ తరువాయి**

కుదిరే దశలో ఉంది" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒప్పంద పత్రాలు దాదాపు సిద్ధంగా ఉన్నాయనీ, కొన్ని రోజుల్లోనే వాటిపై సంతకాలు జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. యూరప్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశముందని కూడా వెల్లడించారు. ఇరాన్ సుప్రీం లీడర్ కూడా ఈ ఒప్పందాన్ని ఆమోదించారని ట్రంప్ ధృవీకరించారు. ఒప్పందంపై సంతకాలు పూర్తి కాగానే ఇరాన్‌పై ఉన్న దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఎత్తివేస్తుందని, దీనివల్ల చమురు ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ ఒప్పందం ప్రకారం అణు ఆయుధాలను అభివృద్ధి చేయబోమని, వాటిని కలిగి ఉండబోమని ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఇరాన్‌తో కుదిరే ఈ అధికార ఒప్పందం పూర్తయ్యే వరకు అమెరికా, మిత్రదేశాలు అమలు చేస్తున్న నౌకాదళ దిగ్బంధం (నావల్ బ్లాకేడ్) యథావిధిగా కొనసాగుతుందని ట్రంప్ తన సోషల్‌ట్రూత్‌లో స్పష్టం చేశారు. తుది ఒప్పంద పత్రాలపై సంతకాలకు సంబంధించిన తేదీ, ప్రదేశ వివరాలను త్వరలో ప్రకటిస్తామని ఆయన వివరించారు.

**ఇరాన్ స్పందన**

అయితే ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ జాగ్రత్తగా ఖండించింది. ఒప్పంద ముసాయిదాలో ఎక్కువ భాగం సిద్ధమైనప్పటికీ, అమెరికా చివరి నిమిషంలో కొత్త డిమాండ్లు పెడుతోందని బఘాయీ ఆరోపించారు. తమ "రెడ్ లైన్స్" నుంచి వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఇరాన్ ప్రధానంగా తన అణు కార్యక్రమంపై అధిక పరిమితులను అంగీ కరించేందుకు సిద్ధంగా లేదనే సంకేతాలు ఇస్తోంది. అలాగే క్షిపణి కార్యక్రమం, ప్రాంతీయ మిత్ర బలగాలకు మద్దతు వంటి అంశాల్లో కూడా రాజీకి ఆస్కారం తక్కువగా కనిపిస్తోంది.

**కొనసాగుతున్న ఉద్రిక్తతలు**

ఒప్పంద చర్చలు జరుగుతున్నప్పటికీ, మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మాత్రం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నాయి. అమెరికా, ఇరాన్ ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుం -టున్నాయి. దక్షిణ ఇరాన్‌లోని రాడార్, నిఘా కేంద్రాలపై అమెరికా దాడులు చేయగా, ప్రతిగా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేసింది. కాగా ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు ఒక్కసారిగా తగ్గాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 89 డాలర్లకు పడిపోయి, ఒక్క రోజులోనే 4.4 శాతం క్షీణించింది. హార్ముజ్ జలసంధి మళ్లీ పూర్తిగా తెరుచుకుం టుందనే ఆశలు ఇందుకు కారణమ య్యాయి. ప్రపంచ చమురు, సహజ వాయువు రవాణాలో కీలకమైన హార్ముజ్ జలసంధిని ఇరాన్ దాదాపు మూసివేయ డంతో గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర ప్రభావాన్ని ఎదుర్కొంటున్న విషయం విదితమే.

# విద్యుత్ ఛార్జీలను పెంచబోం

**జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని సరిదిద్దామన్న గొట్టిపాటి**

**ట్రూడౌన్ విధానం ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించామని వెల్లడి**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా దెబ్బతిన్న విద్యుత్ రంగాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విజయవంతంగా పునరుద్ధరించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... జగన్ ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థలో సృష్టించిన విధ్వంసాన్ని కేవలం రెండేళ్లలోనే సరిదిద్ది, పట్టాలెక్కించామని పేర్కొన్నారు.గత రెండేళ్లలో విద్యుత్ ఛార్జీలను ఒక్క రూపాయి కూడా పెంచలేదని... రాబోయే మూడేళ్లలో కూడా విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం వినియోగదారులపై అదనపు భారం మోపిన 'ట్రూ అప్' విధానానికి స్వస్తి పలికి, చరిత్రలోనే మొదటిసారిగా 'ట్రూ డౌన్' విధానాన్ని తీసుకువచ్చామని తెలిపారు. దీని ద్వారా యూనిట్‌కు 13 పైసల చొప్పున ఛార్జీలను తగ్గించి, ప్రజలకు రూ. 4,498 కోట్ల మేర ఉపశమనం కలిగించామని వెల్లడించారు.గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల కాలంలో ఏకంగా తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై మోయలేని భారం మోపిందని మంత్రి ధ్వజమెత్తారు. సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 6 లక్షల ఉచిత సోలార్ కనెక్షన్లను అందించడానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పాదనను గణనీయంగా పెంచడం ద్వారా, బయటి రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసే ఖరీదైన విద్యుత్ భారాన్ని తగ్గించామన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 160 గిగావాట్ల విద్యుత్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, విద్యుత్ నష్టాలను తగ్గించేందుకు పెద్ద సంఖ్యలో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు.

# నంద్యాలలో... వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన..

## భారీర్యాలీ... కదం తొక్కిన వైసీపీ శ్రేణులు!

**కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజం...**
**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి**
**డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం..**
**శిల్పా రవిరెడ్డి సవాల్**
**రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు అండగా.. వైసీపీ**






**నంద్యాల, జూన్ 12, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాలలో కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్సీపీ పోరుబాట పట్టింది. చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట ఈ నిరసన కార్యక్రమం మిన్నంటింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కార్యాలయం నుండి శ్రీనివాస సెంటర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా నాయకులు ఎడ్లబండ్లు ఎక్కి, గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ నంద్యాల, గోస్పాడు మండలాల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నంద్యాల నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు నిప్పులు చెరిగారు. అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, తల్లికి వందన కింద 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా, సాగునీరు అందక రోడెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని.. అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తెరలేపారని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం: శిల్పా రవిరెడ్డి సవాల్.... నంద్యాల శ్రీనివాస సెంటర్లో డా. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విద్వంసాలు కూటమి ప్రభుత్వంలోనే జరగడం శోచనీయమన్నారు."విగ్రహ విధ్వంసం జరిగిన చోటే.. నంద్యాల ప్రజల సాక్షిగా డా. వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి తీరుతా. ఎవరైనా అడ్డుకుంటే ఊరుకునేది లేదు. ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే నా సొంత ఖర్చులతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సవాల్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ కళ్యాణ మండపం, శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ దుకాణాలను లాక్కున్నారని.. శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇస్తామన్న 5 సెంట్ల ఇళ్ల స్థలాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, ప్రధానంగా రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ భలోపేతానికి అహర్నిషలు పనిచేయాలని రాన్ను రోజుల్లో వైసీపీ అధికారం చేపట్టడం జరుగుతుందని భరోసానిచ్చారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రజలకు చేసిన వెన్నుపోటును విస్తృతంగా ప్రచారం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

# నూనెపల్లె మార్కెట్ యార్డు భూమి టీడీపీ కార్యాలయానికి చేసిన కేటాయింపు రద్దు చేయాలి

**వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్న కలెక్టరేట్ను తక్షణమే తరలించాలి**

**అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం -అఖిలపక్ష సమావేశానికి కూటమి పార్టీలు, ప్రతిపక్ష పార్టీ డుమ్మా**



**నంద్యాల, జూన్ 12, (రిపబ్లిక్ న్యూస్):** వ్యవసాయ రంగం, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన రెండు కీలక అంశాలపై చర్చించి ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నంద్యాలలోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించబడింది. నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తెలుగు దేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడం, అలాగే నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని ఇతర అనువైన ప్రాంతానికి తరలించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ పార్టీలను, వైఎస్సార్సీపీని మినహాయించి మిగిలిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మార్కెట్ యార్డులను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న సమయంలో, నూనెపల్లె మార్కెట్ యార్డులోని సుమారు రూ.70 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని రైతుల ప్రయోజనాల కోసం వినియోగించకుండా రాజకీయ పార్టీకి కేటాయించడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. కేవలం సంవత్సరానికి రూ.1,000 లీజుతో 33 సంవత్సరాల కాలానికి భూమిని కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. అదేవిధంగా, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ కార్యాలయాన్ని అధికారంలోకి వచ్చిన వెంటనే తరలిస్తామని గతంలో హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ, అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఆ హామీని అమలు చేయకపోవడం విచారకరమని సమావేశం అభిప్రాయపడింది. మరోవైపు పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం రైతు ప్రయోజనాలకు ఉపయోగపడే మార్కెట్ యార్డ్ భూమిని కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వం వెంటనే నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిని తెలుగు దేశం పార్టీకి కేటాయించిన ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయాలని, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రాంగణం నుండి కలెక్టరేట్ కార్యాలయాన్ని తక్షణమే తరలించి పరిశోధన కేంద్రాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ అంశాలపై స్థానిక ప్రజాప్రతినిధి, మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ గారికి అఖిలపక్ష వేదిక తరఫున వినతిపత్రం అందజేయాలని నిర్ణయించారు. వినతిపత్రం సమర్పించిన 15 రోజులలోగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో సీపీఎం, సీపీఐ, పార్టీ, అనుబంధ రైతు సంఘాల నాయకులు రాజశేఖర్, సామన్న, రామచంద్ర, సుబ్బారెడ్డి, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకుడు చౌడప్ప, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మస్తాన్, చింతలయ్య, ప్రజా సంఘాల నాయకులు అడ్వకేట్ శంకరయ్య, కొండన్న, సత్యనారాయణ గుప్తా, జానయ్య, రైతు సంఘాల నాయకులు బి.కె. మహేశ్వర్ రెడ్డి, నంది రైతు సమాఖ్య, గడివేముల రైతు సంఘం నాయకులు రామ్మోహన్ రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు ఏర్వ రామచంద్రారెడ్డి, పట్నం రాముడు, మనోజ్, ప్రచార కార్యదర్శి నిట్టూరి సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# 19 మంది ఆర్ఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి

**కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు**

**ప్రజాసేవలో మరింత అంకితభావంతో పనిచేయాలని సూచన**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 12)** ఆర్ముడు రిజర్వ్ విభాగంలో ఆర్ఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న 19 మంది అధికారులు కన్వర్షన్ కింద ఇటీవల సివిల్ సబ్ఇన్స్పెక్టర్లుగా (ఎస్ఐలు) పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారు కర్నూలులోని డీఐజీ రేంజ్ కార్యాలయంలో కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఐపీఎస్ను మర్యాదపూర్వకంగా కలిశారు.పదోన్నతి పొందిన అధికారులకు డీఐజీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లో మరింత నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని కోరారు.పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టేలా క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. పదోన్నతి అనేది మరింత బాధ్యతను తీసుకువస్తుందని, విధి నిర్వహణలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 2009, 2012, 2015, 2018 బ్యాచ్లకు చెందిన పదోన్నతి పొందిన 19 మంది ఎస్ఐలు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**: సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్**

**ఆదోనిలో హోంగార్డుల పరేడ్ పరిశీలన ట్రాఫిక్, శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర కీలకమని వ్యాఖ్య**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 12)** హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ సూచించారు.ఆదోనిలో పర్యటించిన ఆయన హోంగార్డుల పరేడ్ను పరిశీలించి, వారి విధుల నిర్వహణ, క్రమశిక్షణ, సంక్షేమం మరియు ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని హోంగార్డులకు సూచించారు. సేవా దృక్పథంతో పనిచేస్తే ప్రజల్లో పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్, ఆర్ఐ పోతల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లలో వేగం పెంచాలి

**వర్షాకాలంలో ప్రజారోగ్య రక్షణకు అప్రమత్తంగా ఉండాలి**

**స్వచ్ఛ పదం, త్రాగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, జూన్ 12( రిపబ్లిక్ న్యూస్):** గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లు, స్వచ్ఛ పదం కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, వర్షాకాలంలో ప్రజారోగ్య పరిరక్షణ, త్రాగునీటి నిర్వహణ తదితర అంశాలపై స్పెషల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యోగులు చాలా కాలంగా జీతాలు, పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో గ్రంథాలయ సెస్ బకాయిల చెల్లింపులను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు వసూలు చేసే పన్నులలో గ్రంథాలయ సెస్ను సకాలంలో చెల్లించి బకాయిలను పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. వచ్చే వారంలో నిర్వహించే సమీక్ష నాటికి పురోగతి కనిపించకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని ప్రతి బుధవారం తప్పనిసరిగా నిర్వహించి గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని సూచించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ఆలయ మార్గాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుని నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. త్రాగునీటి సరఫరా వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తూ క్లోరినేషన్ ప్రక్రియను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. వాటర్ ట్యాంకులను శుభ్రపరచడం, నీటి నమూనాలను పరీక్షించడం ద్వారా డయేరియా, ఫుడ్ పాయిజనింగ్ వంటి వ్యాధులను నివారించాలని ఆదేశించారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ కోసం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఆధారంగా సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధృవీకరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా, మండల స్థాయి కమిటీలు సమర్థవంతంగా పనిచేసి కుటుంబాల వివరాలను పరిశీలించి ఖచ్చితమైన నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా త్రాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, స్వచ్ఛ రథం వంటి మౌలిక సేవలపై ప్రజల్లో సంతృప్తి పెరిగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. విద్యుత్ సమస్యల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ పంచాయతీల ఆదాయం పెంపుపై దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలకు మరింత నిధులు సమకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**ప్రతి శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ -ఐసీడీఎస్ పీడీ శశికళ వెల్లడి**




**అనంతపురం సంక్షేమం, జూన్ 12,(రిపబ్లిక్ న్యూస్):** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అనంతపురం ఐసీడీఎస్ పీడీ శశికళ తెలిపారు. ఇదే అంశంపై ఐసీడీఎస్, అనుబంధ విభాగాల ఉద్యోగులతో శుక్రవారం విడివిడిగా సమావేశమై మాట్లాడారు. ఎక్స్ టెన్షన్ ఆఫీసర్ ఖాజీ రఫీమున్నీసా, డీసీపీఓ మంజునాథ్, అకౌంటెంట్ ఫాతిమా, ఐసీపీఎస్ ఐసీ వెంకటేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ శశికళ మాట్లాడుతూ ఐసీడీఎస్, అనుబంధ విభాగాల ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం తన ఛాంబర్ లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది తమ సమస్యలు ఏమైనా ఉంటే వినతిపత్రాల రూపంలో ఇస్తే పరిశీలించి తన పరిధిలో ఉన్న వాటిని సత్వరం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తన పరిధిలో లేని వాటిని కలెక్టర్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఐసీడీఎస్ లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ‘విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో జాప్యం ఎందుకు?’

**ప్రభుత్వంపై మహిళా కాంగ్రెస్ ఆగ్రహం**

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తక్షణమే కిట్లు అందించాలి**

**కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో మీసాల సుమలత డిమాండ్**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 12)**
సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా మీసాల సుమలత మాట్లాడుతూ, ప్రభుత్వ అలసత్వం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో తెలుగు భాషలో విద్యార్థులు తడబాటు ఎదుర్కొని, ఉత్తీర్ణత శాతం తగ్గిన పరిస్థితులు ఆందోళన కలిగించాయని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థి మిత్ర కిట్లలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, మూడు జతల యూనిఫాం క్లాత్, స్కూల్ బ్యాగ్, రెండు జతల సాక్సులు, ఒక జత బూట్లు తదితర సామగ్రిని విద్యార్థులకు వెంటనే అందజేయాలని ఆమె కోరారు. ఆంధ్రప్రదేశ్ అధికారిక భాష తెలుగు కావడంతో, విద్యార్థులకు తెలుగు బోధనపై ప్రత్యేక దృష్టి సారించి, పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా సామగ్రి పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం.



**అనంతపురం/ గుత్తి జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
గుత్తి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో కేపీఎస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు నబీరసూలు, సీనియర్ న్యాయవాది నవీన్ నాగరాజు, కోచ్ మగి హాజరయ్యారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం ద్వారా యువతలో ప్రతిభ వెలికితీసే అవకాశం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు అతిథులు విజయాభిలాషలు తెలియజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహా “నందీ” శ్వరుడికి ప్రదోషకాల అభిషేకం






**మహానంది, జూన్ 12,(రిపబ్లిక్ న్యూస్):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలోని మహానందీశ్వర స్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న శ్రీ నందీశ్వర స్వామికి , అధిక జేష్ఠ మాస బహుళ త్రయోదశి, మహాప్రదోషం సందర్భంగా శుక్రవారం ప్రదోష కాలంలో అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని , శాంతారామ్ బట్ సామవేద పండిట్ ,ఆలయ అర్చకులు మూలస్థానం సుబ్బయ్య శర్మ, జనార్ధన శర్మ ,తదితర బృందం ముందుగా గణపతి పూజ, పీఠార్చన, ద్రవ్య పూజలు చేశారు. నందీశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో, పంచామృతం, గంగాజలం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో పాటు జలాభిషేకం, పాలాభిషేకం పూజలు జరిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా నందీశ్వర అభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు నందీశ్వర అభిషేకం తిలకించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పూజా కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి చేయూత

**మానవత్వంతో సాయం అందించిన జీఎంఎస్ టీమ్**

**డిస్కవరీ అనిల్ కుమార్ చేతుల మీదుగా సాయం అందజేత -“ది అనంతపుర్ నైట్“ పోస్టర్ లు ఆవిష్కరణ**







**అనంతపురం ప్రతినిధి, జూన్ 12,(రిపబ్లిక్ న్యూస్):**
అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ టీమ్ అండగా నిలిచింది. డుచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ (డీఎండీ) వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారి పరిస్థితి తెలిసిన వెంటనే సినీ రంగానికి చెందిన జీఎంఎస్ బృందం స్పందించి ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం అనంతపురానికి చెందిన చిన్నారి డీఎండీ అనే అరుదైన కండరాల వ్యాధితో పోరాడుతున్న విషయం మీడియా మాధ్యమాల ద్వారా వెలుగులోకి రావడంతో జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ ప్రతినిధులు ముందుకొచ్చారు. సంస్థ తరపున జీఎం సురేష్, నటుడు మురళీధర్ కలిసి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. డిస్కవరీ అనిల్ ఆధ్వర్యంలో ఈ మొత్తాన్ని చిన్నారి కుటుంబ సభ్యులకు అందించారు.

**ప్రాణాపాయ స్థితుల్లో ఉన్న చిన్నారులకు అండగా నిలవాలి**
ఈ సందర్భంగా సినీ బృందం సభ్యులు మాట్లాడారు ప్రాణాపాయ స్థితుల్లో ఉన్న చిన్నారులకు సమాజం మొత్తం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. మానవతా దృక్పథంతో తమ వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు, సామాజిక సేవా సంస్థలు ముందుకు వస్తే బాధిత కుటుంబాలకు ఎంతో ఊరట లభిస్తుందని వారు పేర్కొన్నారు.

**డెమో ఫిల్మ్ పోస్టర్ లు డిస్కవరీ అనిల్ కుమార్ ఆవిష్కరణ**
అనంతరం జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ బ్యానర్‌పై రూపొందించిన “ది అనంతపుర్ నైట్” డెమో ఫిల్మ్‌కు సంబంధించిన పోస్టర్‌ను డిస్కవరీ అనిల్ ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని త్వరలో జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. చిన్నారి కుటుంబానికి అండగా నిలిచిన జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ బృందాన్ని పలువురు అభినందించారు.

# స్వల్ప వ్యయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**: కమిషనర్ చల్లా ఓబులేసు**

**తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ పనులు వెంటనే చేపట్టాలని ఆదేశం**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 12)**
నగర ప్రజలకు తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి విద్యుత్ దీపాలు వంటి ప్రాథమిక సేవలను మెరుగుపరిచేందుకు స్వల్ప వ్యయంతో ఎక్కువమందికి ప్రయోజనం చేకూర్చే నిర్వహణ పనులను వెంటనే చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.
ఆయన ఏ.క్యాంపు చాణక్యపురి కాలనీ, లక్ష్మీ గార్డెన్స్, జొహరాపురం, రాజేశ్వరి నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, చల్లావారి వీధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా పరిస్థితిపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.
పుష్‌కార్టుల మరమ్మత్తులు, నీటి సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పైప్‌లైన్‌ల అనుసంధానం వంటి పనులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అలాగే బళ్లారి చౌరస్తా వద్ద జరుగుతున్న బైపాస్ రహదారి నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.
యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న ఎస్‌ఏపీ క్యాంపులో పారిశుద్ధ్య కార్మికులకు నిర్వహించనున్న యోగా కార్యక్రమం కోసం వేదికను పరిశీలించారు. రాజేశ్వరి నగర్ పార్కులో ప్రజల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడి స్వచ్ఛత, ఆహార నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్యాంటీన్ వెలుపల వరండాలో అదనంగా 12 టేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీఈఈ నరేష్, ఏఈ జనార్ధన్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్హుల ఓటు హక్కులకు భంగం కలగొద్దు

**ఎం ఆర్ ఓ కు వైఎస్సార్సీపీ వినతి**





**అనంతపురం (వజ్రకరూర్), జూన్ 12,(రిపబ్లిక్ న్యూస్):**
ఎస్ఐఆర్ సర్వే పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం వజ్రకరూర్ మండల తహసీల్దార్ (ఎం ఆర్ ఓ) జయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు.

**అర్హత గల ప్రతి ఓటరుకు, ఓటరు జాబితాలో పేరు ఉండాలి**
ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పీఏసీ సభ్యుడు వై. విశ్వేశ్వరరెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వై. ప్రణయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు ఎం ఆర్ ఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎం ఆర్ ఓ జయశ్రీకి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. అనంతరం ఎం ఆర్ ఓకు సమర్పించిన వినతిపత్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే పునాదని, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించకుండా నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని కోరారు. ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు డిష్ సురేష్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లెల జగదీష్, బీఎల్ఏ మండల ఇన్‌చార్జి హబీబ్, వజ్రకరూర్ టౌన్ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్యాపిలి కిష్టా, ఎద్దాటి రమేష్, వంశీ, జగన్‌రెడ్డి, రమేష్, వీర తిరుమలేష్, రాజశేఖర్, రాములు నాయక్, హరి, లోకేష్ నాయక్, ధనుంజయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రభుత్వంలో సీట్ చోరీ జరుగుతుంది

**ఓటు చోరీ నుండి సీటు చోరీ**

**జెన్ జీ యువతకు కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతం**

**నీట్ లీకు, సీబీఎస్ఈ స్కాం, నిరుద్యోగం తో దేశంలోని యువతలో ఆందోళన**

**యువత కోసం, జిల్లా అభివృద్ధి కోసం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రత్యక్ష పోరాటం**

**కర్నూలు డిసిసి అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ**




**కర్నూలు ప్రతినిధి, జూన్ 12(రిపబ్లిక్ న్యూస్)**
నేటి ఎన్డీఏ బిజెపి ప్రభుత్వంలో సీట్ చోరీ జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ అభిప్రాయపడ్డారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రాంతి నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఓట్ చోరీ, సర్కార్ చోరీ, ఇప్పుడు సీట్ చోరీ, జరగడం జరిగింది అని అన్నారు. మధ్యప్రదేశ్లో మీనాక్షి నటరాజన్ సబ్మిట్ చేసినటువంటి అప్లికేషన్ ను రిజెక్ట్ చేశారు. దీన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. దీన్ని మేము సుప్రీంకోర్టులో కూడా చాలెంజ్ చేయడం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ ద్వారా దీన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. దేశంలో ఇప్పటికి చూస్తూనే ఉన్నాం నీట్ పేపర్ లీకేజ్ కావచ్చు శుక్రవారం రోజు కాంగ్రెస్ పార్టీ జెంజీ పార్టీ వాళ్ళందరినీ కూడా ఆహ్వానించడం జరిగింది. మీరు ఎక్కడికో వెళ్లి మిస్సయిడ్ అవ్వాల్సిన అవసరం లేదు. కాంగ్రెస్ పార్టీ తరుపున మీరు పోరాటం చేయండి. మనమందరం కూడా కలిసి పోరాటం చేద్దాం దేశంలో ఎక్కడ చూసినా కూడా నిరుద్యోగం డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడం, గ్యాస్ సరిగ్గా అందుబాటులో ఉండకపోవడం ప్రతి ఒక్కరు కూడా పరివారన పరిరక్షణమంటున్నారు గానీ ఎవరు కూడా సహకరించట్లేదు మొన్న టీజీ భరత్ గడియారం హాస్పిటల్ దగ్గర ఉన్న చెట్టును కొట్టివేసి ఆ స్థలంలో ట్రాన్స్ఫార్మర్ కట్టాలి అని చెప్పేసి నడిరోడ్డు మీద పెట్టారు దీనితో అక్కడున్నటువంటి వ్యాపారస్తులు హాస్పిటల్ సిబ్బంది చుట్టుపక్కల వాళ్ళు చెట్టు నీడకి ఉండేవాళ్ళు ఇప్పుడు ఆ చెట్టుకొట్టి వేయడంతో చాలా బాధపడుతున్నారు. కొత్త పెన్షన్ ఇస్తామన్న ప్రభుత్వం కొత్త పెన్షన్ ఇవ్వట్లేదు. రాష్ట్రంలో ఉద్యోగాల పరిస్థితిలోనే స్కాములు జరుగుతున్నాయి. అంటే ఇంకా మనకు ఎక్కడ చూసినా స్కాములు కనిపిస్తున్నాయి. అప్పుడు సామాన్యుల పరిస్థితి ఏంటి అని నేను ప్రశ్నిస్తున్నాను. మన ఆంధ్ర రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లా ఏది అంటే కర్నూలు జిల్లా అని నేను చెప్తున్నాను. కర్నూలు జిల్లాలో పెట్టుబడులు తీసుకురాండి తీసుకురండి అని చెప్పేసి మేము చెప్తా ఉంటే ఇంతవరకు దానిమీద ఎటువంటి యాక్షన్ తీసుకోలేదు పట్టించుకోలేదు. గుండ్రేవుల ప్రాజెక్టు కావచ్చు వర్షాలు సరిగా పడక అదే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మనకి మన జిల్లాకి అది ఉపయోగపడేది అని క్రాంతి నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, డిసిసి మాజీ కార్యదర్శులు బి సుబ్రహ్మణ్యం, వెల్దుర్తి శేషయ్య, కాంగ్రెస్ నాయకులు లోక రామయ్య ఐ ఎన్ టి యు సి మద్దిలేటి మొదలగువారు పాల్గొన్నారు.

# గుంతకల్లులో 'వెన్నుపోటుకు రెండేళ్లు' భారీ నిరసన ర్యాలీ

## కదం తొక్కిన వైసీపీ శ్రేణులు






**అనంతపురం/గుంతకల్లు, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై. వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా వైసీపీ ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గుంతకల్లు పట్టణంలో 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించిన ఈ ర్యాలీ వైవీఆర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమై పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు కొనసాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా నైరుతి రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' పేరుతో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, రైతులకు భరోసా, మహిళలకు రక్షణ, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మెగా డీఎస్సీ పేరుతో యువతను మోసం చేశారని, కార్మికుల ప్రయోజనాలను కూడా దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు.

వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం చేరిందని, ప్రస్తుతం సంక్షేమ పథకాలను నిలిపివేసి ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపారని అన్నారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కంటే మోసం, ద్రోహం, వెన్నుపోటే ఎక్కువగా కనిపించిందని మండిపడ్డారు.

రైతులు, యువత, మహిళలు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం ప్రచారాలకే పరిమితమై ప్రజా సమస్యలను విస్మరించిందని విమర్శించారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణాలు, మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జులు, గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

## జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ ..విద్యార్థులకు కిట్ల పంపిణీ





**అనంతపురం ప్రతినిధి, జూన్ 12,(రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను మరింత పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి రోజునే బెలుగుప్ప మండలం కాలువపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నమోదైన అడ్మిషన్లు, తరగతి వారీగా విద్యార్థుల సంఖ్య, ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన విద్యార్థుల వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఆరో, ఏడో తరగతుల్లో నమోదైన విద్యార్థుల వివరాలను పరిశీలించి, చేరికల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి చదువుపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.

**విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గుత్తి డివిజన్ విద్యాశాఖ అధికారి లక్ష్మన్న, మండల విద్యాశాఖ అధికారులు గోవిందరాజులు, హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సుధామని, మండల డిప్యూటీ తహసీల్దార్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్కూలు డ్రెస్సుల కుంభకోణం

## వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

**హైదరాబాద్, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**

స్కూల్ డ్రెస్సులను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సిఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని, 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ అందలేదన్నారు.

# ప్రజలు ఆమోదిస్తేనే పొలిటికల్ ఎంట్రీ

## నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్



**చెన్నై, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**

ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు. తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

# హెచ్-1బీ వీసా ఫీజు పెంపపు వ్యవహారం

## బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ




**వాషింగ్టన్, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**

హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేని భావిస్తున్నారు.

# మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

## నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత

## ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన



**న్యూఢిల్లీ, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల ప్రక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

# తాడిపత్రిలో హై టెన్షన్ .. కేతిరెడ్డి పెద్దారెడ్డి అరెస్ట్

## వెన్నుపోటు కార్యక్రమాన్ని అడ్డుకున్న పోలీసులు -పోలీసులు, పెద్దారెడ్డి మధ్య వాగ్వాదం





**అనంతపురం క్రైమ్, జూన్ 12, (రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం జిల్లా తాడిపత్రిలో హై టెన్షన్ వాతావరణం నెలకొంది. వైసిపి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. తాడిపత్రిలో వైసిపి తలపెట్టిన వెన్నుపోటు కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అయితే కార్యక్రమానికి వెళ్లేందుకు ప్రయత్నించిన పెద్దారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పోలీసులు, పెద్ద రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. వైసిపి కార్యకర్తలు పోలీసులను అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృశ్య పెద్దరెడ్డిని అరెస్టు చేసి అనంతపురం తరలించారు. తాడిపత్రి రావడానికి ఇప్పటికే అనేకసార్లు పోలీసు సెక్యూరిటీ కోరారు పెద్దారెడ్డి. అయితే హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ తాడిపత్రిలో నిరసన కార్యక్రమాన్ని అడ్డుకుని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ని అక్రమంగా అరెస్ట్ చేసి అనంతపురానికి తరలించిన చర్యను నిరసిస్తూ జిల్లా ఎస్పీ కార్యాలయం ముందు కేతిరెడ్డి పెద్దారెడ్డి బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, వెన్నుపోటుకు రెండేళ్లు, రెడ్ బుక్ రాజ్యాంగం నశించాలంటూ, సీఎం డౌన్ డౌన్ , ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దోపిడి రాజ్యం దొంగల రాజ్యం అంటూ వైసిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారీ సంఖ్యలో జిల్లా ఎస్పీ కార్యాలయానికి వైసీపీ నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు.

**జేసీ తనపై రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారు**

ఈ సందర్భంగా కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ తాను తాడిపత్రికి వెళ్లేందుకు భద్రత కల్పించాలని కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా ఆదేశాలు వచ్చినప్పటికీ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. గత కొంతకాలంగా రాజకీయ ప్రత్యర్థులు పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని తనను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. గత 14 నెలల నుండి రెండుసార్లు తాడిపత్రికి వెళితే అదే పోలీసులను పావుగా వాడుకొని జెసి ప్రభాకర్ రెడ్డి నన్ను ఇంటి నుంచి బయటికి పంపించే ప్రయత్నం చేశాడన్నారు. పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకొని వ్యవహరిస్తున్నారని, చేతనైతే ముందుకొచ్చి కొట్లాడితే తాను కొట్లాడేకి సిద్ధమన్నారు. దొంగతిడుగురు రాజకీయాలు మానుకోవాలని, నా దమ్ము ధైర్యం ఏంటో జెసి ప్రభాకర్ రెడ్డికి అతనితోపాటు మిగిలిన వారందరికీ తెలుసని హితవు పలికారు. తమ కుటుంబంతో జెసి ప్రభాకర్ రెడ్డి కుటుంబం జీవితకాలమంతా ఫైట్ చేస్తూనే ఉంటుందన్నారు.



జెసి దిక్కుతోచని స్థితిలో మతిభ్రమించి చేస్తున్నారని 74 ఏళ్ల వయసులో రాజకీయం చేస్తున్న వ్యక్తితో మాట్లాడడమే తప్పన్నారు. విధి లేని పరిస్థితుల్లో చేసి ప్రభాకర్ రెడ్డి గురించి మాట్లాడాల్సి వస్తోందని, అన్ని తక్కువ వచ్చాయని ప్రస్తుతం ఆయన స్మశానాల మీద పడ్డారని అన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి తనపై రాజకీయ కక్షతో వ్యవహరిస్తున్నారని ఆరోపించిన పెద్దారెడ్డి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. తాడిపత్రిలో తన ఇంటిపై ఎలాంటి చర్యలు తీసుకునే ధైర్యం ప్రత్యర్థులకు లేదని వ్యాఖ్యానించారు.

# కోటూరులో ఘనంగా మనబడి మన పండుగ



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 12 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి మండలం ఎంపీ యుపిఎస్ కోటూరు పాఠశాలలో ఈరోజు ఘనంగా మనబడి మన పండగ కార్యక్రమం జరిగింది ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం నూతనంగా పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులను పాఠశాల పూర్వ విద్యార్థులు పూలమాలలతో సాదరంగా ఆహ్వానించి పాఠశాలను పరిచయం చేసి తమలో మమైక్యం చేసుకొనే ఒక ప్రత్యేకమైన కార్యక్రమం. మన బడి మన పండుగ ఈ కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రకిట్ల పాఠశాలలో చదివేటువంటి విద్యార్థులందరికీ ఉచిత యూనిఫామ్ ఉచిత పాఠ్యపుస్తకాలను ఉచిత నోట్ బుక్స్ మాజీ సర్పంచ్ గ్రామ పెద్దలు చంద్రమౌళి విద్యార్థుల తల్లిదండ్రుల చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బళ్ళాపురం మురళి విద్యార్థులకు అందజేశారు విద్యార్థులకు స్వీట్స్ పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు కేశవరెడ్డి,తిరుమలమ్మ ఉపాధ్యాయులు బాబు రమేష్, రమణ ,ఆర్కే భాగ్యలక్ష్మి ,ఉషశ్రీ, తేజస్విని, శివకుమార్,షాహిన్ రమణమ్మ, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తిరుపతి మహాసభకు తరలిన చౌడేపల్లి తెలుగు తమ్ముళ్లు



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 12 రిపబ్లిక్ న్యూస్**
తిరుపతి పట్టణంలో జరిగిన రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం మహాసభకు చౌడేపల్లి నుంచి పలువురు తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. నియోజకవర్గ నాయకుడు మాదిరాజు లక్ష్మణ రాజు ( పతి రాజు) మాదిరాజు ప్రదీప్ రాజు ల ఆధ్వర్యంలో చౌడేపల్లి మండలంలోని తెలుగు తమ్ముళ్లు సభకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంతకుముందు అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు ఏ విధంగా అందాయన్న అంశాలపై నినదిస్తూ వాహనాల ద్వారా తిరుపతికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు హరి రాయల్ ,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల రామచంద్రయ్య ,కార్తీక్, పవన్ కుమార్,వేలూరు సుబ్రహ్మణ్యం, బోయకొండ శివప్ప,రామకృష్ణ తదితరులు తిరుపతికి తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

# సాంప్రదాయ బద్ధంగా వినాయక స్వామి మండలి పూజ



**చౌడేపల్లి ప్రతినిధి జూన్ 12 రిపబ్లిక్ న్యూస్**
మండలంలోని విజయవాడలో గల విజయ వినాయక స్వామి మండల పూజను సాంప్రదాయపద్ధంగా నిర్వహించారు 40 రోజుల క్రితం నాయుని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్మించి ప్రాణ ప్రతిష్ట జరిగిన క్రమంలో మండల పూజ అదే తరహాలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారి ఆలయం నందు వివిధ పూజారి కార్యక్రమాలు జరిగాయి చుట్టుపక్కల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విజయ వినాయక స్వామిని దర్శించుకుని నిర్వహకులచే తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం.



**రైల్వే కోడూరు జూన్ 12 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండల పరిధిలో గల ముక్కువారిపల్లి పంచాయతీ అరుంధతి వాడలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, సాయంత్రం ఐదు గంటల సమయంలో బలమైన గాలులు, వర్షం కారణంగా విద్యుత్ లైన్లు ఒకదానికొకటి తాకడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. విద్యుత్ స్తంభానికి బిగించాల్సిన వైర్లు సరిగా బిగించకపోవడంతో అవి గాలికి ఊగి పరస్పరం ఢీకొన్నాయి. దీంతో విద్యుత్ నిప్పురవ్వలు ఎగిసి సమీపంలోని గుడిసెపై పడి మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో అరుంధతి వాడకు చెందిన దగ్గుల వెంకటమ్మ, ఆమె భర్త సీనయ్య నివాసముంటున్న గుడిసె దగ్ధమైంది. ఘటన సమయంలో వెంకటమ్మ జీవనోపాధి కోసం ముక్కువారిపల్లి గ్రామంలో పనికి వెళ్లి ఉండగా, ఇంట్లో ఉన్న పిల్లలు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఆమె వెంటనే అక్కడికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేసి ఆర్పివేశారు. అయితే గుడిసెలో ఉన్న గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు వెంకటమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.
బాధిత కుటుంబానికి ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు తక్షణ ఆర్థిక సహాయం అందించి, నష్టపరిహారం మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను వెంటనే మరమ్మతులు చేసి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# జూన్ 28న పల్స్ పోలియో విజయవంతం చేయండి

## డాక్టర్ స్వర్ణ దీప.





**రైల్వే కోడూరు జూన్ 12 రిపబ్లిక్ న్యూస్.**
మండల కేంద్రం ఓబులవారిపల్లె మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించడం జరిగింది ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మండలవైద్యాధికారి స్వర్ణ దీప పాల్గొని పల్స్ పోలో సిబ్బందికి అవగాహన కల్పించారు జూన్ 28న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో సిబ్బంది విధులకు తప్పనిసరిగా హాజరై పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె వారిని కోరారు 5 సంవత్సరముల లోపు వయసున్న పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఆమె పిల్లల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సురేంద్ర రాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నర్సులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొనడం జరిగినది.

# బాబు రెండేళ్ల వెన్నుపోటు నిరసన ర్యాలీ

## -బాబుకు వ్యతిరేక నినాదాలు

## భారీగా వచ్చిన పార్టీ శ్రేణులు






**పుంగనూరు జూన్ 12 ప్రజా రిపబ్లిక్**
వైఎస్సార్‌సిపి ఆధ్వర్యంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంపై వెఎస్సార్‌సిపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పుంగనూరు నియోజవర్గ కేంద్రంలో నిరసన ర్యాలీ విజయవంతమైంది. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, ఎంపిపిలు భాస్కర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ఈశ్వరయ్య, జెడ్పిటిసి సోమశేఖర్‌రెడ్డి , రెడ్డిశ్వర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్ధిన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్బోర్డు మాజీ చైర్మన్ అమ్ము ఆధ్వర్యంలో వేలాది మంది పట్టణంలోని ప్రైవేటు బస్టాండ్‌కు చేరుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రైవేటు బస్టాండ్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. వేలాది మంది కార్యకర్తలు పార్టీ జెండాలు పట్టుకుని, ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా చంద్రబాబు వెన్నుపోటుతో సూపర్-6 గోవిందాడ ఇదేమిరాజ్యం దొంగలరాజ్యం.దోపిడిరాజ్యం అంటు నినాదాలు చేశారు. అలాగే వైఎస్సార్‌సిపి జిందాబాద్‌డజగనన్న జిందాబాద్ పెద్దిరెడ్డి జిందాబాద్‌డమిధున్‌రెడ్డి జిందాబాద్ అంటు నినాదాలతో హ్గరేత్తించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శులు కొండవీటి నాగభూషణం,వెంకట్ రెడ్డి యాదవ్ ,రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్ బాబు, బోయకొండ మాజీ చైర్మన్ నాగరాజారెడ్డి,ఉమ్మడి జిల్లాల ఐటివింగ్ ఇన్‌చార్జ్ ప్రకాష్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయరామిరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్రమణ,విద్యార్థి విభాగం కార్యదర్శి కళ్యాణ్‌భరత్, చౌడేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు నాగభూషణరెడ్డి,మాజీ ఎంపీపీ అంజిబాబు, రుక్మిణమ్మ, వైస్ ఎంపీపీలు సుధాకర్ రెడ్డి ,నరసింహారెడ్డి, పార్టీ కన్వీనర్లు ఇర్ఫాన్, అమరనాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, కరీముల్లా, నాదమునిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర, యువజన నాయకులు రాజేష్, సురేష్, రామకృష్ణారెడ్డి, కంచి,సుబ్రమణ్యం, మనోజ్‌కుమార్‌నాయక్, వాసునాయక్, డాబాశీను నాయక్, వేణునాయక్ పెద్దాయన అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు.



**రైల్వేకోడూరు జూన్ 12 రిపబ్లిక్ న్యూస్** ఓబులవారిపల్లి మండల పరిధిలోని వై.కోట యూనిట్ చెన్నరాజుపోడు పంచాయతీలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ బుల్లయ్య రైతులకు పీఎండీఎస్ విత్తనాలతో సీడ్ బాల్స్ తయారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజామృతం, బంకమట్టి, ఘనజీవామృతం, బూడిదతో విత్తనాలకు కోటింగ్ ఇచ్చి సీడ్ బాల్స్ తయారు చేయడం ద్వారా వర్షాలు పడకముందే భూమిలో విత్తనాలను చల్లవచ్చని తెలిపారు. సీడ్ బాల్స్ ఉపయోగించడం వల్ల చీమలు, క్రిమికీటకాల నుంచి ' విత్తనాలకు రక్షణ లభిస్తుందని వివరించారు. గ్రామానికి చెందిన ఐదుగురు రైతులు సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ పద్ధతిని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎండీఎస్ విత్తనాల్లో 32 రకాల మొక్కల విత్తనాలు ఉంటాయని, ఇవి భూమిని గుల్లగా మార్చి సూక్ష్మజీవుల అభివృద్ధికి దోహదపడటంతో పాటు ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలను అందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీఆర్పీలు టీ-ఐసీఆర్పీలు పలువురు రైతులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అమలు చేసి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు సూచించారు.

# ఏదేచ్ఛగా చెరువు మట్టి అక్రమ తరలింపు

## కరువైన చర్యలు, - ప్రజల డిమాండ్.



**రైల్వే కోడూరు జూన్ 12 రిపబ్లిక్ న్యూస్.**
ఓబులవారిపల్లి మండల పరిధిలోని పెద్దపురంపాడు చెరువు నుంచి 20 రోజులుగా భారీ యంత్రాలు ట్రాక్టర్ల సహాయంతో మట్టిని నిరంతరాయంగా తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారుల నుండి చర్యలు కరువయ్యాయని,ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే, ఎల్లయ్యపల్లి సచివాలయం సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఇటీవలే నిర్మించిన తారురోడ్డుపై భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. చెరువు మట్టిని తరలించే ట్రాక్టర్ల నుంచి రోడ్డుపై మట్టి పడిపోవడంతో రహదారి మట్టీమట్టి రోడ్డులా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.
రోడ్డుపై పేరుకుపోయిన మట్టిపై ట్యాంకర్ల ద్వారా నీరు చల్లడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఏర్పడిందని ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు ఆరోపించారు, ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.
ఇదే సమయంలో రహదారి పక్కన ఉన్న రైతుల మామిడి తోటలపై కూడా మట్టి దుమ్ము పేరుకుపోవడంతో పండ్ల నాణ్యత కోల్పోతున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో తమకు ఆర్థిక నష్టం వాటిల్లుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు మట్టి అక్రమ రవాణాపై విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు రహదారులను పునరుద్ధరించి రైతులు, ప్రయాణికులకు న్యాయం చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# ఓర్వకల్లులో నెలకొల్పిన పరిశ్రమల్లో స్థానిక యువతీ యువకులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలి

## సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డి గౌస్ దేశాయ్ డిమాండ్




**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 12(రిపబ్లిక్ న్యూస్)**
శుక్రవారం రోజు సిపిఎం పార్టీ మండల కమిటి సమావేశం ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ మధుసూదన్ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మండల కార్యదర్శి బి నాగన్న మండల కమిటీ సభ్యులు రామకృష్ణ మద్దయ్య పాల్గొన్నారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్బుగా మారిన తర్వాత అనేక పరిశ్రమలు స్టీల్ ప్లాంట్ కొక్క కోలా గ్రీన్ కో సోలార్ మరియు అనేక ఇతర పరిశ్రమలు వచ్చాయని ఆ పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వచ్చి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించారని అయితే దీనికి విరుద్ధంగా ఇతర రాష్ట్రాలు ప్రాంతాల నుండి కార్మికులను కారు చౌకగా తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారని ఈ ప్రాంతంలో ఉండే యువతీ యువకులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా యంత్రాంగం స్పందించి స్థానిక యువతి యువకులకు 75% ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి నాగన్న మాట్లాడుతూ మండలంలో పరిశ్రమల పేరుతో వేల ఎకరాల భూములను రైతుల నుండి తీసుకున్నారని అయితే వీటిలో నష్టపరిహారం రాక అనేక మంది రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిశ్రమల్లో భూములు కోల్పోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని అదేవిధంగా భూములు కోల్పోయిన రైతులు మరియు వ్యవసాయ కార్మికులకు పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రైతులు నిరుద్యోగ యువతీ యువకులు నిర్వాసితులను కదిలిస్తామని హెచ్చరించారు

# ఉప్పలపాడు- గుట్టపాడు గ్రామాలలో స్వర్ణ గ్రామ ఆఫీసులను సందర్శించారు

## మండల అధికారిఎంపీడీవో నాగ అనసూయ






**ఓర్వకల్లు ప్రతినిధి,**
**జూన్ 22(రిపబ్లిక్ న్యూస్)**
శుక్రవారంశుక్రన ఉప్పలపాడు మరియు గుట్టపాడు స్వర్ణ గ్రామ ఆఫీసులను సందర్శించడం జరిగింది స్వర్ణ గ్రామ సిబ్బంది యొక్క పనితీరు గురించి పబ్లిక్ పర్సెప్షన్ గురించి సిబ్బందితో చర్చించడం జరిగినది అలాగే స్వచ్ఛరథం గురించి ఉప్పలపాడు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది పొడి చెత్తను స్వచ్ఛరతంగు అందజేయమని ప్రజలకు తెలియజేయడం జరిగింది మరియు చెత్త నుండి సంపద సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించడం జరిగినది

# అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తూ

## ప్రెస్ మీట్ నిర్వహించిన నేరడి గుంట సర్పంచ్ సాయికుమార్

**ఆందోల్ ప్రతినిధి జూన్ 12( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
గత రెండు రోజులుగా నా మీద కొంతమంది వ్యక్తులు కావాలనే అసత్య ప్రచారాలు, నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు నేను ఆధారాలతో సహా ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.
నేను సర్పంచ్‌గా గెలిచి నేటికి 5 నెలలు 21 రోజులు పూర్తయ్యాయి. ఈ కాలంలో గ్రామ అభివృద్ధి కోసం మాత్రమే పనిచేశాను. నా రాజకీయ జీవితంలో ఇప్పటి వరకు ఒక్క గజం స్థలం గానీ, ఒక్క గుంట భూమి గానీ కబ్జా చేసిన చరిత్ర లేదు. గ్రామ ప్రజల ఆశీస్సులతో పారదర్శకంగా, నిజాయితీగా ప్రజాసేవ చేస్తున్నాను.
నా రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను జీర్ణించుకోలేక కొంతమంది వ్యక్తులు వ్యక్తిగత కక్షలతో నాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. కుటుంబ సమస్యలను రాజకీయాలకు ముడిపెట్టి నా పేరు ప్రతిష్టలకు భంగం



కలిగించే కుట్ర చేస్తున్నారు. అంతేకాకుండా నా అనుచరుడిపై దాడి చేయించడం వంటి ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఈ రోజు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సంబంధిత అన్ని అంశాలను ఆధారాలతో సహా ప్రజల ముందుంచడం జరిగింది. ఎవరైనా నాపై ఆరోపణలు చేయాలనుకుంటే రాజకీయంగా ఎదుర్కోవాలి. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై మాట్లాడాలి. కానీ వ్యక్తిగత, కుటుంబ విషయాలను బయటకు తీసుకువచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం చాలా దురదృష్టకరం.
నేను మరోసారి స్పష్టంగా చెబుతున్నాను... ధమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి, ప్రజా సమస్యలపై చర్చించాలి. కానీ వ్యక్తిగత విషయాలను రాజకీయాల్లోకి లాగడం మానుకోవాలి. ఇలాంటి నీచ రాజకీయాలను ప్రజలు ఎప్పటికీ క్షమించరు. గ్రామాభివృద్దే నా లక్ష్యం. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నేరడిగుంట గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తాను. ఈ ప్రెస్ మీట్‌లో ఉపసర్పంచ్ కొడనా ఈశ్వర్ గారు, మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్ గారు, సంగమేశ్వర్ గారు, గ్రామ పెద్దలు బాపిరెడ్డి గారు, గున్నాల నాగప్ప గారు, వార్డు సభ్యులు, అలాగే గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

# నూతన ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసిన పత్రికా విలేకరులు

**అందోల్ ప్రతినిధి జూన్ 12 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
అందోల్–జోగిపేట్ నూతన రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ బాబు(ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన అధికారిని స్థానిక పత్రికా విలేకరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన ఆర్డీవోకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మన సమగ్ర ప్రజావాణి రిపోర్టర్ రాజు, రిపబ్లిక్ రిపోర్టర్ బుచ్చయ్య, సాక్షి డిజిటల్ రిపోర్టర్ భాగయ్య పాల్గొన్నారు. ప్రాంత అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి



అంశాలపై ఆర్డీవోతో వారు చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, రెవెన్యూ సంబంధిత సమస్యలను పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి ఉంచుతానని తెలిపారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అభినందించారు. పత్రికా విలేకరులు నూతన ఆర్డీవోకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో పరిపాలనకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# మత్తు పదార్థాలను నియంత్రించాలి

## రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించొద్దు -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 12 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
శుక్రవారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యల అమలు ,మత్తు పదార్థాల నిర్మూలనపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించరూ. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో



పనిచేయాలని సూచించారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టులు వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, యువతలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, చట్ట విరుద్ధంగా మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన విషయంలో ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో, ఆర్ అండ్ బి ఈ, ఈ వేణు, డీఎస్పీలు ,జిల్లా రవాణా శాఖ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు ,ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

## పాణ్యం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన

**రైతులకు యువతకు మహిళలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వం**

**వైయస్సార్ సీపిపాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**

**కల్లూరు ప్రతినిధి, జూన్ 12(రిపబ్లిక్ న్యూస్)**
శుక్రవారం రోజునపాణ్యం నియోజకవర్గం ఎన్నికల ముందు యువత, మహిళలు, రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాటసాని రామభూపాల్ రెడ్డి నివాసం వద్ద నుంచి ఐటీసీ సర్కిల్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను నిరసిస్తూ నినాదాలతో




హోరెత్తించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో కాటసాని మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గొప్పగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలు నేటికీ అమలు కాలేదని, యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక భరోసా, రైతులకు గిట్టుబాటు ధరలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఇప్పుడు అదే ప్రజలను మోసం చేస్తున్నాడు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు కేవలం ఎన్నికల మాయమాటలుగానే మిగిలిపోయాయి" అని ఆయనవిమర్శించారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలకు నిరసనగా సూపర్ సిక్స్ పథకాల ప్రతులను కాటసాని రామభూపాల్ రెడ్డి, పాణ్యం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన తెలిపారు. "హామీలు అమలు చేయాలి ప్రజలకు న్యాయం చేయాలి" అంటూ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

# ఆర్‌డీఓ మారినా... బోర్డుపై పేరు మాత్రం పాతదే

## -అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

**అందోల్ ప్రతినిధి జూన్ 12( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందోల్–జోగిపేట్ ఆర్‌డీఓ కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార సూచిక బోర్డుపై ఇప్పటికీ మాజీ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) పేరు కొనసాగుతుండటం సందర్శకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.
ప్రభుత్వ బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో ఆర్‌డీఓ మారినప్పటికీ, కార్యాలయంలోని సూచిక బోర్డును ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజలకు సరైన సమాచారం అందించాల్సిన ప్రభుత్వ కార్యాలయంలోనే పాత వివరాలు ప్రదర్శించబడటం అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రోజూ వందలాది మంది ప్రజలు కార్యాలయానికి వచ్చే పరిస్థితిలో, ప్రస్తుతం విధుల్లో ఉన్న అధికారుల పేర్లు, సంప్రదింపు




వివరాలు స్పష్టంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే పాత ఆర్‌డీఓ పేరు అలాగే ఉండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. అలాగే ఆఫీస్ వాట్సాప్ మొబైల్ లో కూడా మారని ఫోటో ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, సూచిక బోర్డులో తాజా వివరాలను నమోదు చేసి ప్రజలకు సరైన సమాచారం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

# మళ్ళీ మొదలైన చదువుల పండగ

**మరో కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చదువుల పండగ మళ్లీ మొదలైంది**

**ఓర్వకల్లు ప్రతినిధి, జూన్ 12(రిపబ్లిక్ న్యూస్)**
మరో కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చదువుల పండగ మళ్లీ మొదలై సందడి చేసింది. ఓర్వకల్లు మండలం శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాలతో మొదటిరోజు పాఠశాల కళకళలాడింది. పాతా. కొత్త విద్యార్థులు పాఠశాల కు హాజరై ఉత్సాహంగా గడిపారు. ఉదయం జరిగిన ప్రార్థన సమావేశంలో పాఠశాల



ప్రధానోపాధ్యాయిని కమతం సునీత విద్యార్థులందరికీ పాఠశాలకు పున స్వాగతం పలికారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఆమె గత ఏడాది పదవ తరగతి ఫలితాలు ఇచ్చిన సంతృప్తిని వారితో పంచుకున్నారు. ఈ ఏడాది పదవ తరగతి అభ్యసించే విద్యార్థులు గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులచే మనబడి. మన పండగ కార్యక్రమానికి సంబంధించి సమిష్టి ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రారంభమైన గంటలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు, సమదస్తులు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందంతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల సేవలో బాధ్యతాయుతంగా మరో సంవత్సరం పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు. ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న కాల నిర్ణయ పట్టికను ( టైం టేబుల్) సబ్జెక్టు వారీగా.. ఉపాధ్యాయులకు అందజేసే దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ప్రసాద్ రెడ్డి శ్రీనివాసులు రత్నకుమార్ గజేంద్రుడు, కృష్ణప్ప,నాజర్ అలీ, సుమిత్ర పాల్,మహిళా ఉపాధ్యాయుని లు విజయ శ్యామల, కుమారమ్మ,,ప్రసన్న కుమారి, తౌహీద్ భాను,జయలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయుడు మహమ్మద్ భాష జూనియర్ అసిస్టెంట్ గోపీనాథ్ ల్యాబ్ అసిస్టెంట్ అలీశీ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమాన్ని ఓర్వలేని గొడ్డలి పార్టీ

## పాలకవీటి విజయ కుమార్ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

**కర్నూలు ప్రతినిధి, జూన్ 12(రిపబ్లిక్ న్యూస్)**
కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన గురించి నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ మాట్లాడుతూ, సంక్షేమము,అభివృద్ధి,సుపరిపాలన ధ్యేయంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం ఇది ప్రజాప్రభుత్వం అని అన్నారు. ఆంధ్ర ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని అఖండ మెజారిటీ తో గెలిపించి నేటికీ రెండేళ్లు రాష్ట్ర విభజన జరిగిన నాటికి ఆంధ్ర రాష్ట్రము దిక్కు తోచని స్థితిలో నిరాశ నిస్పృహ రాజధాని లేని రాష్ట్రముగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లో 2014 లో తెలుగుదేశం ప్రభుత్వం నీ నారా చంద్రబాబు నాయుడు పై నమ్మకం ఉంచి గెలిపించారు ప్రజల అభిష్టానికి అనుగుణంగా సూపరిపాలన అందించి అట్టడుగునా ఉన్న రాష్ట్రము నీ ప్రగతి పథము లో నడిపించారు ఆంధ్రప్రదేశ్ రాజధాని కి రైతులను ఒప్పించి భూసేకరణ చేసి రాజధాని కి ఒక రూపం తెచ్చారు అంతలోనే 2019 ఎన్నికలో ఒక్క ఛాన్స్ అన్న ఒక దూస్టున్ని నమ్మి అధికారం కట్టబెట్టరు కానీ ఆయన విధ్వసం ధ్యేయంగా, కక్షలు, కుట్రలు తో పాలన సాగించి రాష్ట్రన్ని అట్టడుగునా నెట్టారు మళ్ళీ 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు చాణుక్యం పవన్ కళ్యాణ్ పోరాటం, మోడీ సహకారం తో ప్రజలు కూటమిని అఖండ మెజారిటీ తో గెలిపించారు ఆ నమ్మకం వమ్ము చేయకుండా ఈ రెండేళ్లలో గాడి తప్పిన రాష్ట్రాన్ని, ఆగిన పోలవరం ని, నిరుద్యోగ యువత నిస్పృహ పోగొట్టి అభివృద్ధి పథం లో నడుస్తుంది ఎన్నో సవాళ్ళను ఎదురుకొని సూపర్ సిక్స్ హామీలు అమలు పరుస్తూ సాధ్యం కాదు అన్న నోర్లు ముయించి సుసాధ్యం



చేసి ఈ రెండేళ్ల లో ఎన్నో సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చారు తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకి 10,090 కోట్ల రూపాయలు జామచేశారు, శ్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ద్వారా 71 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి, అన్నాదాత సుఖీభవ ద్వారా 46 లక్షల ఖాతాలో 8985 కోట్ల సాయం అందించారు, మామిడి, కోకో, ఉల్లి రైతులు కి 1100 కోట్ల సాయం అందింది, పట్టాదారు పాస్ పుస్తకం పంపిణి , ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, భూ వివాదాలు పరిస్కారం, పోలవరం నిర్వశితులకు 2250 కోట్ల సాయం, కేవలం వందరోజుల్లో హంద్రీనివా పూర్తి చేసి కుప్పనికి నీల్లు, చింతలపూడి,నేరేడు, వెలిగొండ ప్రాజెక్టు లు పూర్తి దిశగా ముందుకు సాగుతు కేవలం ప్రాజెక్ట్ లకు 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది,20,060 కిలోమీటర్లు రోడ్ల నిర్మాణం 2500 కోట్లతో గుంతలు లేని రాష్ట్రముగా చేసారు, అమరావతి నిర్మాణం, గెజిట్ నోటిఫికేషన్ ద్వారా రాజధాని కల నేరవర్చడం, పోర్టులు,హైవేలు, విమానాశ్రయలు,లక్ష కోట్ల విలువైన రైల్వే నిర్మాణాలు జరుగుతున్నాయి యువత ఆశలకు అనుగుణంగా డేటా సెంటర్, గూగుల్, కాగ్నిజెంట్, సెమీ కండక్టర్, ఏ ఐ హబ్, క్వాంటం వ్యాలీ, ఓర్వకల్లు లో డ్రోన్ సిటీ, ఉర్దూ యూనివర్సిటీ, సోలార్ పరిశ్రమలు, త్వరలో కర్నూలు లో హై కోర్టు బెంచ్ ఏర్పాటు యువత కి ఉద్యోగావకాశ కల్పన లక్ష్యంగా 15491 ఉపాధ్యాయ పోస్టులు , 5757 కానిస్టేబుల్ పోస్టులు మొత్తంగా 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలు ఇవ్వడం జరుగుతుంది. కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంగా ముందుకు సాగుతుంది ప్రజల గడప వద్దకే పాలన లాగా వాట్స్అప్ గవర్నెన్స్ అందుబాటులోకి వచ్చింది నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది కేవలం ఈ రెండేళ్లలో ఇంత మంచి ప్రగతిని చూపెట్టింది అభివృద్ధి పథంలో ఆంధ్ర రాష్ట్రాన్ని నడిపిస్తున్న కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రతిపక్ష వైసిపి పార్టీకి అభివృద్ధి సంక్షేమము కనబడుటలేదని కళ్ళు లేని కబోదిగా మారిందని ఇప్పటికైనా కళ్లు తెరుచుకొని వైసీపీ నాయకులు చూస్తే డబల్ ఇంజన్ సర్కారుతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏ విధంగా దూసుకుపోతుందో తెలుస్తుందని అన్నారు

# సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

## పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే)

## స్వయంగా సిబ్బంది అర్జీలను స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఎస్పీ ఆదేశం

**నంద్యాల క్రైం, జూన్ 12, (రిపబ్లిక్ న్యూస్):** పోలీసు సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని నంద్యాల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సునీల్ షోరాణ్ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన "పోలీస్ సంక్షేమ దివస్" (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది, హోంగార్డులు హాజరై, తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. సిబ్బంది నుండి వినతులను స్వయంగా స్వీకరించిన జిల్లా ఎస్పీ, వారి సమస్యలను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలపై




సత్వరమే తగు పరిష్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి భరోసా కల్పించారు. అంతేకాకుండా, ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులను ఎస్పీ అక్కడికక్కడే ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ "నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది మానసిక ప్రశాంతత, వారి సంక్షేమం మాకు ముఖ్యం. 'పోలీస్ వెల్ఫేర్ డే' ద్వారా సిబ్బంది సమస్యలపై సత్వర చర్యలు తీసుకుని పరిష్కరిస్తున్నాం. విధుల్లో సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు పడకుండా వారి సమస్యలను తొలగించడం ద్వారా, వారు ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేలా చేయడమే మా ప్రధాన లక్ష్యం." ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**జూన్ 21న లక్ష మందితో జిల్లా వ్యాప్తంగా భారీ యోగా కార్యక్రమం**

**యోగాంధ్ర-2026 విజయవంతానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలి -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపు**






**నంద్యాల బ్యూరో, జూన్ 12( రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహానంది దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, యోగా సాధకులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. నిత్యం 30 నుంచి 45 నిమిషాల పాటు యోగాభ్యాసం చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవడుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో సమతుల్యత సాధించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన వంటి విలువలను కూడా పెంపొందిస్తుందని వివరించారు. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంకల్పంతో జూన్ 7న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు జూన్ 21 వరకు గ్రామ, వార్డు, మండల, జిల్లా స్థాయిల్లో నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. యోగాపై ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్ ద్వారా నమోదు చేసుకొని అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సిద్ధం కావాలని కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో ఇప్పటికే శ్రీశైలం దేవస్థానం, మహానంది దేవస్థానాల్లో యోగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 17న జిల్లాకు కేటాయించిన ప్రత్యేక థీమ్ ఆధారంగా యోగాంధ్ర అసోసియేషన్ సభ్యులందరితో కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే జూన్ 21న జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సుమారు ఒక లక్ష మందితో భారీ యోగా కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా యోగా ప్రదర్శన ఇచ్చిన మహిళా బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. యోగా శిక్షణ అందించిన రమ్యతో పాటు ప్రదర్శనలో పాల్గొన్న ఐదుగురు సభ్యులు మహిళలే కావడం విశేషమని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచిన వందితను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఉదయం నుంచే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన తహసీల్దార్, ఎంపీడీవో, ఆర్డీవో, మహానంది దేవస్థానం ఈఓ, జిల్లా యంత్రాంగం, ఆయుష్ మరియు వైద్య బృందాలకు, అలాగే కార్యక్రమ విజయవంతానికి నాయకత్వం వహించిన జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌కు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహానంది క్షేత్రంలో నిర్వహించిన ఈ యోగా కార్యక్రమం పాల్గొన్న వారిలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు యోగాపై మరింత ఆసక్తిని కలిగించిందని కలెక్టర్ పేర్కొన్నారు.

# 32వ స్వర్ణ వార్డును పరిశీలించిన కలెక్టర్ జి. రాజకుమారి

**స్వర్ణ వార్డు సేవలపై సమీక్ష.. ఫిర్యాదులను గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్)**
ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శుక్రవారం నంద్యాల పట్టణంలోని 32వ స్వర్ణవార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్వర్ణ వార్డులో అందిస్తున్న వివిధ పౌర సేవలు, ప్రజల నుండి స్వీకరిస్తున్న దరఖాస్తుల పరిష్కార విధానం, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. స్వర్ణవార్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న సేవల వివరాలు, సంక్షేమ పథకాల అమలు తీరు, ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వ్యవస్థపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు ఆశ్రయిస్తున్నందున ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. స్వర్ణవార్డు పరిధిలోని కుటుంబాల వివరాలు, పథకాల అర్హతలు, సేవల డెలివరీ స్థితిగతులపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని నవీకరించాలని సూచించారు. స్వర్ణవార్డులో నిర్వహిస్తున్న రికార్డులు, ఫైళ్ల నిర్వహణ, కార్యాలయ పరిశుభ్రత, ప్రజలకు అందుబాటులో ఉంచిన సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, కార్యాలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణ వార్డుకు వచ్చిన పలువురు స్థానికులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. అందిన వినతులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల ద్వారానే చేరుతున్నందున ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

# “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజలకు చేరువైన ప్రభుత్వ విజయాలను విస్తృతంగా చాటాలి**

**జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్**



**నంద్యాల బ్యూరో, జూన్ 12( రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం టేక్కె మార్కెట్ యార్డులో ఈ నెల 17వ తేదీన జరగనున్న “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ వెంట నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, మున్సిపల్ కమీషనర్ శేషన్న, సిపిఓ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం“ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లను పూర్తిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అదే విధంగా సభా ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ఎల్ఈడి స్క్రీన్లు, వైద్య శిబిరాలు, రవాణా సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి

**ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**





**నంద్యాల బ్యూరో, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్):**
రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఉన్న బైసాని ట్రేడర్స్ ఎరువులు, యూరియా విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల పంపిణీకి వినియోగిస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 ఆన్‌లైన్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు ఎలా పంపిణీ చేస్తున్నారనే అంశంపై వివరాలు తెలుసుకొని, అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా స్టాక్ నమోదు, పంపిణీ విధానం, రైతుల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి ఆధార్ కార్డుతో డీలర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. డీలర్ లాగిన్ అయిన అనంతరం రైతు ఆధార్ నంబర్ నమోదు చేయగా, రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాత రైతుకు సంబంధించిన భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, అవసరమైన ఎరువుల వివరాలు స్క్రీన్‌పై ప్రదర్శితమవుతాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి మేరకు రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువుల కోసం డీలర్ల వద్దకు వెళ్లే ముందు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) ఇంచార్జ్‌ను సంప్రదించి, ఈ-క్రాప్‌లో నమోదైన పంట వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఒకవేళ పంట మార్పిడి జరిగి ఉంటే, సంబంధిత వివరాలను సవరించి నమోదు చేయించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఇతర మండలాలు లేదా ఇతర ప్రాంతాల్లోని డీలర్ల వద్ద ఎరువులు పొందాలనుకునే రైతులు ముందుగానే ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ద్వారా సంబంధిత డీలర్ల పేర్లను తమ ఖాతాలో జోడించుకోవాలని సూచించారు. ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ధృవీకరించి ఆమోదించిన పంట వివరాలు మాత్రమే డీలర్ లాగిన్‌లో కనిపిస్తాయని, వివరాలు ఆమోదం పొందని పక్షంలో రైతుల సమాచారం డీలర్‌కు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా తగిన నిల్వలు అందుబాటులో ఉంచాలని, పంపిణీ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు, డీలర్లకు సూచించారు. వ్యవసాయ శాఖ జెడి వెంకటేశ్వర్లు ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

# దొంగలు అరెస్ట్ ... నాలుగు బైకులు స్వాధీనం



**మహానంది, జూన్ 12, (రిపబ్లిక్ న్యూస్)**
మహానంది దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 9వ రెండు బైకులను చోరీచేసిన ఇద్దరిని శుక్రవారం అరెస్టు చేసినట్లు నంద్యాల ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ తెలిపారు. సీఐ శ్రీనివాసులు రెడ్డి, మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహానంది దేవస్థానం సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, మరో ఉద్యోగి గురు ప్రసాద్ వారి బైకులను ఆలయ ప్రాంగణంలో ఉంచగా చోరీకి గురైన విషయం తెలిసిందే అన్నారు. మహానంది పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ వేగవంతం చేశారన్నారు. అందులో భాగంగా నంద్యాల పట్టణానికి చెందిన గోపీ నాయక్, మేనుగ రాజు, ప్రకాష్, సాబిర్ హుసేన్ లను అరెస్టు చేసి వారి నుంచి మహానందిలో చోరీ చేసిన పల్సర్, ఎఖీ డీలక్స్ బైకులతో పాటు నంద్యాల త్రీ టౌన్, ఆళ్లగడ్డ టౌన్ పరిధిలోని చోరీ కేసుల్లో ఎత్తుకెళ్లిన రెండు బైకులు కలిపి 4 బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ. 2.70 లక్షలు ఉంటుందన్నారు. బైకులను చోరీచేసిన దొంగలు డూప్లికేట్ తాళాలను ఉపయోగించి చాకచక్యంగా బైకులను ఎత్తుకెళ్లారన్నారు. నంద్యాల సిసిఎస్, మహానంది పోలీసులు సీసీ కెమెరాల ద్వారా చోరీకి పాల్పడిన వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. బైకుల చోరీ కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు సిబ్బందిని నంద్యాల ఎస్పీ సునీల్ షోరాణ్ అభినందించారు

# విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే బలమైన పునాది

**: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**పాఠశాల పునఃప్రారంభ వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్**

**-- విద్యార్థులకు పుష్పాలతో ఘన స్వాగతం**

**విద్యా నాణ్యత, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి**

**- తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించిన కలెక్టర్**





**నంద్యాల బ్యూరో, జూన్ 12 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా శుక్రవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సందర్శించారు. కొత్త విద్యా సంవత్సరానికి హాజరైన విద్యార్థులకు పుష్పాలు అందజేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. విద్యార్థులతో మమేకమై వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, విద్యా వాతావరణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ విద్యపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలలో ఆరవ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు గులాబీ పువ్వులు అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పిల్లలను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోరారు. విద్యార్థుల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించాల్సిన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్లను ఎలాంటి జాప్యం లేకుండా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కిట్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బెల్ట్‌లు, షూస్ తదితర విద్యా సామగ్రి విద్యార్థులకు అందజేయబడుతుందని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు వంటి అంశాలను పరిశీలించి సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కిచెన్ షెడ్‌ను సందర్శించి పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత, పరిశుభ్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్.ఓ. తాగునీటి వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఆర్.ఓ. ప్లాంట్‌ను సక్రమంగా నిర్వహిస్తూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నందుకు సిబ్బందిని అభినందించారు. పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణను కూడా పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన అన్ని పారిశుద్ధ్య సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ఆవరణ విశాలంగా ఉండటంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటి హరిత వాతావరణాన్ని పెంపొందించాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించిన విద్యార్థులందరికీ జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనతో ముందుకు సాగి విద్యా రంగంలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com